క్లుప్తంగా

ప్రతీ నెల రూ.1,000

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టుల సంక్షేమ నిధుల నుంచి మరణించిన జర్నలిస్టుల కుటుంబాల పిల్లలకు ప్రతీ నెల రూ.1,000 చొప్పున అందించేందుకు రాష్ట్ర మీడియా అకాడమీ నిర్ణయించినట్లు టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మరణించిన జర్నలిస్టుల పిల్లలు ఎవరైనా ఉంటే జిల్లా పౌర సరఫరాల అధికారి సంపత్‌కుమార్‌కు బోనఫైడ్ సర్టిఫికెట్ అందజేయాలని పేర్కొన్నారు.

ఎస్పీఎం మిల్లులో కార్మికునికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ పేపర్ మిల్లులో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు రాజేశం గాయాలపాలయ్యాడు. శనివారం మిల్లులో విధులు నిర్వహిస్తున్న క్రమంలో చేతికి గాయమైంది. వెంటనే తోటి కార్మికులు స్పందించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

'విద్యార్థులకు నాణ్యమైన విద్య'



యూనిఫాం అందజేస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. శనివారం మండలంలోని బాబాపూర్, రౌట సంకెపల్లి పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన విద్య అందుతుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మను కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

జైనూర్: నేడు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ సాయికిరణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 33కేవీ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉండే చెట్ల నరికివేత, వంగిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేసేందుకు ఉదయం 9 గంటల నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నపత్రం ఇవ్వాలి

రెబ్బెన: సింగరేణిలో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న ఇంటర్నల్ ఈపీ ఆపరేటర్స్ పరీక్ష పత్రాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ముద్రించి ఇవ్వాలని హెచ్ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంగ్లిష్ మీడియంలో చదివిన ఉద్యోగులు ఉన్నందుకు వారికి తెలుగులో ప్రశ్నపత్రం అందిస్తే తెలుగుపై పూర్తిస్థాయిలో అవగాహన లేక పరీక్షలు బాగా రాయలేరన్నారు. గతంలో ఈపీ ఆపరేటర్స్ పరీక్షలు నిర్వహించిన సమయంలో ఇంగ్లిష్ మీడియం చదివిన అభ్యర్థులు తెలుగు ప్రశ్నపత్రంతో అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. డ్రైవింగ్ టెస్టులో ప్రతిభ చూపినప్పటికీ రాత పరీక్షల్లో ప్రతిభ చూపలేకపోయారని పేర్కొన్నారు. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం తెలుగుతో పాటు ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నపత్రాన్ని అందించేలా యాజమాన్యం చూడాలన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ పూర్తిస్థాయి కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అంగల తిరుపతి, ఎండీ ఇసాక్, గంధం శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా జంబుల మధూకర్, శ్రీనివాస్, అధ్యక్షులుగా సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా తిరుమలచారి, కోశాధికారిగా షఫీ ఉల్లా, ఉపాధ్యక్షులుగా సురేశ్, మహేశ్, సతీశ్ కుమార్, జమీల్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేశ్, జాయింట్ సెక్రటరీగా సంతోష్, సభ్యులుగా రాజు, అబ్దుల్‌సమీర్, శ్రీకాంత్, విశ్వనాథ్, అనిల్, నల్లాల రాజు, బి.రాజులను ఎన్నుకున్నారు.

వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా కనుగుట్ట వాసి

బోథ్: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధ కళాశాల అయిన యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్, సైఫాబాద్‌లో వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన వెంకట రమరణ బాధ్యతలు స్వీకరించారు. కాగా మారుమూల ప్రాంతం నుంచి వెంకట రమణ వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ అనుబంధ కళాశాల అయిన యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో వృక్షశాస్త్ర విభాగ అధిపతిగా నియమితులైన సందర్భంగా గ్రామస్తులు, మండలవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువైద్య కేంద్రాలపై పట్టింపేది?

- అరకొర వసతుల నడుమ కొనసాగింపు
- వైద్యులు లేక పాడి రైతులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రం

వాంకిడి: మండలంలో పశువైద్యంపై పట్టింపు కరువైంది. సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడం, ఏళ్లుగా ఆసుపత్రి భవనాలు నిర్మించకపోవడంతో పశు వైద్యం కుంటుపడుతుంది. వివిధ గ్రామ పంచాయతీల్లో పశువుల సంఖ్య 5వేల నుంచి 10వేల వరకు ఉండగా ఆయా పంచాయతీ కేంద్రాల్లో ఉప ఆరోగ్య కేంద్రాల ఆవశ్యకత ఏర్పడింది. కానీ అధికారులు పశు వైద్యంపై దృష్టి సారించకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో మొత్తం 62,632 పశువులు ఉండగా మూడు పశువైద్య ఆసుపత్రులు మాత్రమే ఉన్నాయి. వాటిలో కూడా సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో పాడి రైతులు, పశు పోషకులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అవసరమున్న గ్రామాల్లో నూతన ఉప పశువైద్య కేంద్రాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు ఇందాని గ్రామంలో ప్రైమరీ సెంటర్, కనర్‌గాంలో ఉప పశువైద్య కేంద్రాలు ఉన్నాయి.

సిబ్బంది కొరత..

మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు ఉండగా మండల కేంద్రంలోని ప్రధాన పశువైద్య కేంద్రంలో ప్రధాన పోస్టు ఖాళీగా ఉంది. కొన్నేళ్ల నుంచి ఆసుపత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ కుర్చీ ఖాళీగా ఉంది. ఆసిఫాబాద్ ఏడీగా ఉన్న డాక్టర్ రమేశ్ వాంకిడి ఆసుపత్రికి ఇన్‌చార్జి ఏడీగా కొనసాగుతున్నారు. రెండు మండలాల బాధ్యతలు ఉన్నందున మండలంలో పశువైద్యంపై పట్టింపు లేకుండా పోయింది. ఏడీ పోస్టుతో పాటు ఆఫీస్ సబార్డినేట్‌లు ఇద్దరు, వెటర్నరీ అసిస్టెంట్‌లు ఒకరు ఉండాలి. కానీ ఒక సబార్డినేట్, ఒక వెటర్నరీ అసిస్టెంట్‌తోనే ఆసుపత్రి కొనసాగుతుంది. అలాగే కనర్‌గాం ఉప కేంద్రంలోనూ రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందాని ప్రైమరీ సెంటర్‌లో మాత్రమే ఒక వైద్యుడు, ఒక అసిస్టెంట్, ఇద్దరు అసిస్టెంట్‌లు ఉన్నారు. ఇందానిలో దశాబ్దాల క్రితం నిర్మించిన ఆసుపత్రి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో మండల కేంద్రంలోని ఆసుపత్రి స్టోర్‌లో నిర్వహిస్తున్నారు. పాత భవనం కూలిపోయే దశకు రావడంలో మందులు, వైద్య పరికరాలు, యంత్రాలతో పాటు వైద్య సిబ్బంది కూడా చిన్నపాటి స్టోర్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఉంది.

మండలంలో 62,632 పశువులు..

మండలంలో గొర్లు -11397, బర్రెలు -4426, ఎడ్లు, ఆవులు -21472, మేకలు- 25337 మొత్తంగా 62,632 జీవాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా పశు వైద్యానికి సంబంధించి మూడు ఆసుపత్రులే ఉండటంతో సరైన సమయాల్లో రైతులు తమ పశువులకు ఉచిత వైద్యం అందించలేకపోతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. ఖమాన, బంబార, ఖిరిడి, సవాతి దాబా గ్రామ పంచాయతీల్లో వైద్య కేంద్రాలు లేకపోవడంతో పాడి రైతులు, పశు పోషకులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. పశువైద్యంపై వివరణ కోరేందుకు వాంకిడి ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ రమేశ్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా కాల్ కలవలేదు. పశువైద్యంపై ఫిర్యాదు చేసేందుకు ఏడీకి ఎప్పుడు ఫోన్ చేసినా కలవదని, అసలు ఆ ఫోన్ నంబరు మనుగడలో ఉందో లేదోనని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నూతన ఆసుపత్రులు మంజూరు చేయాలి



మండలంలో మూడు పశువైద్య ఆసుపత్రులు మాత్రమే ఉండటంతో పల్లెలోని పశువులకు వైద్యం భారంగా మారుతుంది. దీంతో గ్రామాల్లోకి వచ్చే ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స చేయించాల్సి వస్తుంది. క్లస్టర్‌కు ఒకటి చొప్పున లేదా పశు సంపద ఎక్కువ ఉన్న గ్రామాల్లో ప్రభుత్వ పశు వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– జాడి బాపు

వైద్య సిబ్బందిని నియమించాలి



మండలంలో ఉన్న ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి. వైద్య సిబ్బంది లేక అనుకున్న స్థాయిలో పశువులకు వైద్యం అందడం లేదు. అధికారులు దృష్టి సారించి పశువైద్యాన్ని మెరుగుపర్చాలి.

– కడప భీము

బెల్టు షాపులను అరికట్టాలి



కంఠకాలనీలోని డ్రెయినేజీని పరిశీలిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కంఠకాలనీ, పైకాజీనగర్, ఇతర కాలనీల్లో కొనసాగుతున్న బెల్టు షాపులను తొలగించాలని, మురికి కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్‌లు డిమాండ్ చేశారు. బస్తీబస్తీకి డీవైఎఫ్ఐ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు పట్టణంలోని పైకాజీనగర్, కంఠకాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయినేజీల్లో చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో మురికి నీరు రోడ్డుపైకి వస్తుందని, కాలనీల్లో చెత్త కుండీలు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే కంపు కొడుతుందని పేర్కొన్నారు. అదే విధంగా కాలనీల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులతో యువత చెడు వ్యసనాలకు చేరవయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నిఖిల్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పుట్టిన రోజు పురస్కరించుకొని శనివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



స్థలాలు పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసేందుకు సోమవారం మున్సిపల్ అధికారులు పరిశీలించారు. పట్టణంలోని ఈఎస్ఐ టర్నింగ్, ఛత్రపతి శివాజీ చౌరస్తా, రాజీవ్‌గాంధీ చౌరస్తాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎస్పీఎం మిల్లు సౌజన్యంతో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయనున్నామని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. త్వరలోనే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్ అహ్మద్, డీఈఈ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి

తిర్యాణి: ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24 నిర్వహించే చలో ఐటీడీఏ ఉట్నూర్ కార్యక్రమం విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెసా యాక్ట్‌ను పటిష్టంగా అమలు పర్చడంతో పాటుగా జీవో నెం.3 పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఆదివాసీల గ్రామాల్లో 1/70 పకడ్బందీగా అమలు పర్చడం తదితర డిమాండ్ల సాధన కోసం ఉట్నూర్‌లో ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆదివాసీ సంఘాల నాయకులు మడావి శ్రీరామ్, పెందుర్ ధర్ము తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుమల విశ్వనాథ్

జైనూర్: అధికారులు సకాలంలో తమకు కేటాయించిన బాధ్యతలు నిర్వర్తించి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ తిరుమల విశ్వనాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుమ్ర తిరుమల అధ్యక్షతన ప్రారంభమైన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలు చదివి విన్పించారు. వేసవికాలం సెలవులు ముగిసి పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో ఆయా పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ మాట్లాడుతూ పశువైద్య అధికారులు పశువులకు గాలికుంటు టీకాలు సకాలంలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, ఎంపీటీసీలు, మండల అధికారులు ఉన్నారు.

బొగడగూడెం సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సౌందర్య

రెబ్బెన: తుంగెడ గ్రామ పంచాయతీ పరిధిలోని బొగడగూడెంలో ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను శనివారం ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆదేశాలతో బొగడగూడెం వాసులకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో రూ. 5లక్షల ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలన్నారు. వర్షాలు పెరిగేలోపూ పనులు పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, కిషోర్, వాసుదేవ్, జీవన్, మహేందర్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కనక ప్రభాకర్

నార్నూర్: మెగా డీఎస్సీ నిర్వహించి, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏ బ్యాక్‌లాగ్ పోస్టులనుభర్తీ చేయాలని ఈనెల 24న తుడుందెబ్బ ఆధ్వర్యంలో తలపెట్టిన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. జీవో 3తో పాటు ఏజెన్సీ ప్రాంతంలో పోడు భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలివ్వాలన్నారు. ఉద్యోగస్తులు, విద్యార్థులు, యువతీ, యువకులు, ఉపాధ్యాయ కార్మిక కర్షక మేధావులు, కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఆదివాసీ గిరిజనులు వారి హక్కుల కోసం పోరాటం చేసే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు మాడవి మాన్కు, జిల్లా నాయకుడు మెస్రం మాణిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'అందరికి అండగా షీటీం'



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: అందరికి అండగా షీటీం పని చేస్తుందని ఏఎస్సై పసివుద్దీన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు షీటీం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్, వాట్సప్ మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలకు ఆపద సమయంలో 100కు, షీటీంకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యురాలు సునీత, ప్రిన్సిపాల్ నలంద, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి



సీసీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి చాపిలె సాయికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయ సీసీవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫాంలు అమ్మకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రైవేట్ విద్యాసంస్థల్లో నోటు పుస్తకాల నుంచి పాఠ్యపుస్తకాల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. రెన్యూవల్ చేసుకోని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచితంగా విద్యను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, మండల నాయకులు కొట్రంగి కార్తీక్, పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం



విద్యుత్ కేబుల్ అమర్చుతున్న విద్యుత్ సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కాపువాడలో నెలకొన్న విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గతంలో కాపువాడకు రూరల్ పరిధిలోని భట్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా కొనసాగేది. దీంతో తరుచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి కాపువాడ కాలనీవాసులు ఇబ్బందులకు గురయ్యేవారు. శనివారం పట్టణంలోని ఆదర్శనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు పనులు చేపట్టారు. దీంతో కాపువాడ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో కౌన్సిలర్ జైచందర్, విద్యుత్‌శాఖ ఏఈ కమలాకర్, ఫోర్‌మెన్ భూమయ్య, లైన్ ఇన్స్‌పెక్టర్ ఎమ్మాజీ సతీశ్, మురళీ, ఆంజనేయులు, శ్యాంబాబు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య



మాట్లాడుతున్న సీడీపీవో సురేఖ

కాగజ్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలో విద్య అందనుందని సీడీపీవో సురేఖ అన్నారు. శనివారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు పూర్వప్రాథమిక విద్యపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన విద్యాచట్టానికి అనుగుణంగా ప్రాథమిక దశలోనే చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో కేంద్రాలను ప్రీస్కూళ్లుగా ప్రభుత్వం మార్చేందుకు సిద్ధమైందన్నారు. తొలిదశలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరోజినిదేవి, భాగ్యలక్ష్మి, అనసూర్య, రమాదేవి, మాధవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

తిర్యాణి: మండల కేంద్రంలోని కన్యక పరమేశ్వరి ఆలయ 19వ వారికోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు శనివారం ముగిశాయి. రెండవ రోజు భక్తులు హోమంతో పాటు మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు కమలాకర్ శర్మ, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పల్లెర్ల విగ్నేశ్, కోలిపాక కిరణ్ కుమార్, గుల్బం చక్రపాణి, రవి తదితరులు ఉన్నారు.

పోడు భూముల సమస్య పరిష్కరించండి

బోథ్: పోడు భూముల సమస్య పరిష్కరించాలని బోథ్ మండలంలోని కౌఠ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణను శనివారం కలిసి విన్నవించారు. విత్తనాలు వేయాలంటేనే భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు రైతుల పక్షాన నిలబడతానని, జిల్లా అటవీ శాఖ అధికారులతో మాట్లాడతానని ఆమె భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గాజుల సురేందర్, సున్నపు శ్రీనివాస్, పాలేపు గణేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో శుక్రవారం రాత్రి ఇంటి పైకప్పు కూలి మృతి చెందిన ఉషా పాండే కుటుంబాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ తోడ్పాటు అందేలా కృషి చేస్తామని భరోసానిచ్చారు. ఎమ్మెల్యేతో బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాలామున్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబాలను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. మండలంలోని సావర్గాం మాజీ సర్పంచ్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి పరామర్శించారు. అర్లి(టి)లో మాజీ ఎంపీటీసీ గోల్లి రామయ్య శుక్రవారం మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని సైతం పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఎదులాపురం: మున్సిపల్ జవాన్ నర్సింలు శుక్రవారం గుండెపోటుతో మృతి చెందగా.. ఆయన కుటుంబాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. నర్సింలు గుండెపోటుతో మృతి చెందడం బాధకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాంగ్ పార్కింగ్ వాహనాలపై పోలీసుల కొరడా

చెన్నూర్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి పెద్ద చెరువు కట్ట వరకు రాంగ్ పార్కింగ్ చేసిన వాహనదారులకు జరిమానా విధించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి చెరువు కట్ట వరకు నిత్యం రద్దీగా ఉంటుందని, ట్రాఫిక్ సమస్య వస్తుందని ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. ప్రజలు చేసిన ఫిర్యాదు మేరకు శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కల్గించే విధంగా రాంగ్ పార్కింగ్ చేసిన 5 కార్లు, 30మోటర్ సైకిళ్ల యాజమానులకు జరిమానా విధించారు. పది షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సైలు శ్వేత, వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.